


# భర్తకు భార్య భరణం

**విడాకుల కోసం భర్తకు రూ. 50 వేలు చెల్లించిన భార్య!**

**కుటుంబ సభ్యుల ఒత్తిడితో ప్రేమ వివాహం పెటాకులు**

**కోర్టు ఖర్చుల కోసం భర్త షరతు**

**ప్రజానావ, ముంబై:** విడాకుల అనంతరం భర్త నుంచి భార్య భరణం పొందడం సహజం. కానీ, విడాకులు కావాలని కోరుతూ భార్యే భర్తకు డబ్బులు చెల్లించిన వింత ఘటన మహారాష్ట్రలోని పూణే నగరంలో వెలుగుచూసింది. విద్యానగరంగా పేరొందిన పూణేలో జరిగిన ఈ ఉదంతం ఇప్పుడు సామాజిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒకే వీధిలో నివసించే యువతీ యువకులు ప్రేమించుకుని, గత ఏడాది ఏప్రిల్ 19న ప్రత్యేక వివాహ చట్టం కింద కోర్టులో పెళ్లి చేసుకున్నారు. అయితే, ఆర్థిక స్తోమత లేకపోవడం మరియు కుటుంబ సభ్యుల నుండి ఎదురైన తీవ్ర వ్యతిరేకత ఈ జంట మధ్య చిచ్చు పెట్టింది. కుటుంబ సభ్యుల ఒత్తిడిని తట్టుకోలేకపోయిన సదరు యువతి, వివాహమైన కొద్ది రోజులకే ఫ్యామిలీ కోర్టులో విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేసింది. భర్తతో కలిసి ఉండటం తనకు ఇష్టం లేదని స్పష్టం చేసింది. అయితే, భర్త మాత్రం కాపురం చేయడానికి సిద్ధంగా ఉన్నానని, ఎటువంటి తప్పు చేయని తనను కోర్టుకు లాగి మానసిక క్షోభకు గురిచేస్తున్నారని వాదించాడు. చివరకు విడాకులు ఇవ్వడానికి ఒక వింత షరతును విధించాడు. తనను అనవసరంగా కోర్టు చుట్టూ తిప్పినందుకు గాను, చట్ట పరమైన ఖర్చుల కింద భార్య తనకు రూ. 50,000 చెల్లించాలని కోరాడు. భర్త విధించిన ఈ ఆర్థిక షరతుకు భార్య అంగీకరించడంతో, ఆమె ఆ మొత్తాన్ని చెల్లించింది. దీంతో న్యాయస్థానం వారిద్దరికీ విడాకులు మంజూరు చేస్తూ తీర్పునిచ్చింది. మారుతున్న సామాజిక పరిస్థితుల్లో సంబంధాల కంటే ఆర్థిక లావాదేవీలకే ప్రాధాన్యత పెరిగిపోతోందనడానికి ఈ కేసు ఒక ఉదాహరణగా నిలిచింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న జంట ఇలా ఆర్థిక ఒప్పందంతో విడిపోవడం పట్ల సామాజిక విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




# అదృశ్యం.. ప్రశ్నార్థకం

**మహారాష్ట్రలో లక్ష మందికి పైగా మహిళలు, బాలికలు మిస్సింగ్**

**నవజాత శిశువులను విక్రయిస్తున్న ముఠాలు**

**బడ్జెట్ సమావేశాల్లో వెలుగులోకి వచ్చిన విస్తుపోయే నిజాలు**

**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్రలో మహిళలు, చిన్నారుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. గత రెండేళ్లలో (2024-25) రాష్ట్రవ్యాప్తంగా సుమారు 93,940 మంది వయోజన మహిళలు, 23,429 మంది మైనర్ బాలికలు అదృశ్యమైనట్లు స్వయంగా పోలీసు గణాంకాలే చెబుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశంపై చర్చ జరగడంతో రాష్ట్రంలో నెలకొన్న భయానక పరిస్థితి వెలుగులోకి వచ్చింది. అదృశ్యమైన వారిలో ఇప్పటికీ 26,482 మంది మహిళలు, 4,659 మంది బాలికల ఆచూకీ లభించకపోవడం గమనార్హం.

**శిశువుల విక్రయ ముఠాల కలకలం**

ఒకవైపు మహిళల అదృశ్యం కలవరపెడుతుండగా, మరోవైపు నవజాత శిశువులను విక్రయించే ముఠాల కార్యకలాపాలు తల్లిదండ్రులను వణికిస్తున్నాయి. ముంబై, పూణే, థానే, చంద్రపూర్ వంటి ప్రధాన నగరాల్లో పసిపిల్లల అమ్మకాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందాయి. గత ఏడాది డిసెంబర్‌లో బద్లాపూర్‌లో ఆరుగురు నిందితులను అరెస్టు చేయడంతో ఈ అక్రమ దందా గుట్టు రట్టయింది. పాఠశాలల్లో పిల్లల భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక ఆడిట్‌కు ఆదేశించినా, క్షేత్రస్థాయిలో భయాందోళనలు తగ్గడం లేదు.

**ప్రభుత్వ చర్యలు - ఆపరేషన్ ముస్కాన్**

ముఖ్యమంత్రి, హోం మంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఈ అంశంపై స్పందిస్తూ.. అదృశ్యమైన వారిని కనిపెట్టేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 45 ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థుల రక్షణ కోసం పోలీస్ కాకా అండ్‌పోలీస్ దీదీ పథకాలను అమలు చేస్తున్నారు. తప్పిపోయిన పిల్లలను కనిపెట్టేందుకు నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్ ద్వారా ఇప్పటి వరకు వేలాది మందిని సురక్షితంగా కుటుంబాల చెంతకు చేర్చారు. కేవలం ఈ ఏడాది జనవరి-ఫిబ్రవరి మధ్యలోనే 1,400 మందికి పైగా బాలురు, బాలికలను గుర్తించినట్లు ప్రభుత్వం పేర్కొంది. పెరుగుతున్న ఈ అదృశ్యాల వెనుక మానవ అక్రమ రవాణా ముఠాల హస్తం ఉందా అనే కోణంలో పోలీసులు విచారణ వేగవంతం చేశారు.

## నేరెళ్ల ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు

# ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ప్రజానావ, సిరిసిల్ల :** తంగళ్ళపల్లి మండలం నేరెళ్ల ఇస్కాన్ మందిరంలో గౌర పూర్ణిమ హోలీ, శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. బుధవారం నేరెళ్ల ఇస్కాన్ ఫామ్ నూతన జగన్నాథ మందిరంలో కన్నుల పండుగగా ఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవంగా నితాయి మూర్తులకు అభిషేకం చేశారు. అనంతరం హరికథ చైతన్య మహాప్రభు లీలలు ప్రవచనం అత్తాపూర్ టెంపుల్ అధ్యక్షులు సచినందన్ ప్రభుజీ ప్రబోధించారు. తర్వాత మంగళహారతి 56 రకాల ప్రసాదాలతో కృష్ణునికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 1500 మంది అన్న ప్రసాదం స్వీకరించినట్టు తెలిపారు. అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం ఇస్కాన్ ప్రతినిధులు చైతన్యథ ప్రబుజి అలాగే 150 మంది భక్తులు హైదరాబాద్ నుంచి ఇస్కాన్ భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి, స్వరూప తిరుపతి రెడ్డి, ప్రముఖులు, సమీప గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. సిరిసిల్ల ఇస్కాన్ ఇంచార్జ్ శ్రీమాన్ శ్రీప్రాణనాథ అచ్యుత దాస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు






# పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

- **ఇంటింటి సేకరణ, ఫీల్డ్ సందర్శనలు చేస్తున్న సిబ్బంది**
- **సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖాదిర్ పాషా**

**ప్రజానావ, సిరిసిల్ల :** ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, వివిధ లైసెన్స్ ఫీజులు, ప్రకటనల ఫీజులు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని గృహ యజమానులు వాణిజ్య గృహ యజమానులకు మున్సిపల్ కమిషనర్ ఖాదీర్ పాషా విజ్ఞప్తి చేశారు. పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, డ్రైనేజ్ వ్యవస్థ బలోపేతం వంటి అభివృద్ధి కార్యక్రమాలు పన్నుల ద్వారా లభించే ఆదాయంతోనే నిర్వహించబడుతున్నాయని, అందుకే ప్రతి పన్నుదారుడు తన బాధ్యతగా భావించి బకాయిలు లేకుండా తక్షణమే చెల్లింపులు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కోరారు. ప్రస్తుతం పురపాలక సిబ్బంది మొత్తం పన్నుల వసూళ్లలో నిమగ్నమై, ఇంటింటి సేకరణ, ఫీల్డ్ సందర్శనలు నిర్వహిస్తూ లక్ష్య సాధనకు కృషి చేస్తున్నారని, పట్టణ ప్రజలు సహకరించి సకాలంలో పన్నులు చెల్లించాలని ఆశిస్తున్నామని కమిషనర్ ఖాదిర్ పాషా తెలిపారు.



# వేములవాడలో రంగులకేళి

- **హోలీ వేడుకల్లో పాల్గొన్న విప్ ఆది శ్రీనివాస్**
- **చెడుపై మేలు సాధించిన విజయానికి ప్రతీక**
- **ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు**



**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ పట్టణంలో బుధవారం హోలీ సంబరాలు మిన్నంటాయి. రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పట్టణంలోని మున్సిపల్ పాలకవర్గం, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పరస్పరం రంగులు పూసుకుంటూ, స్నేహభావాన్ని చాటుతూ ప్రజలందరికీ ఆయన హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, హోలీ పండుగ మన సంస్కృతిలో ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని, ఆనందాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. కులమత బేధాలు, అంతస్తుల తారతమ్యాలు లేకుండా ప్రతి ఒక్కరూ కలిసి జరుపుకునే ఈ పండుగ సమాజంలో సామరస్యాన్ని పెంపొందిస్తుందని అన్నారు. ముఖ్యంగా హోలీ అనేది చెడుపై మేలు సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే పర్వదినమని ఆయన వివరించారు. హోలీకి ముందు రోజు మన ప్రాంతంలో కామ దహనం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని ఆయన గుర్తు చేశారు. పురాణాల ప్రకారం హోలీక అనే రాక్షసి మరణించిన సందర్భంగా ఉత్తరాదిలో హోలీకా దహనం అని, మన ప్రాంతంలో కామ దహనం అని పిలుచుకుంటూ వేడుకలు జరుపుకోవడం ఆచారమని తెలిపారు. ప్రజలందరూ సురక్షితంగా, పర్యావరణహితంగా రంగులతో ఈ వేడుకలను జరుపుకోవాలని ఆయన కోరారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ రంగుల పండుగ ప్రతి కుటుంబంలో ఆనందాన్ని, సుఖశాంతులను నింపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

